కథ

ఏకాంతానికెన్ని వేల రూపాలు?

ఎన్ని వేల రుచులూ!

అన్నన్ని వేల అనుభూతులు...

రెండు కర్ణేంద్రియాల మధ్య బూడిదరంగు గుజ్జు మాయమైన అనుభూతి...

ఆ గుజ్జు మాయమైన శూన్యంలోకి కూడా చొరవగా చొరపడింది ఏకాంతం!

"కభీ తన్హాయి యోమేయూం" ముభారక్బేగం గొంతునించీ ప్రవహించిన ఏకాంతపు ఏకాంతాన్ని నా గది, మది నిండిన ఏకాంతంలోకి ఆహ్వానించా... లాభంలేదు పుచ్చు పట్టిన చెక్కదుక్కలోకి... యిటుకగోడ చీలికలోకి దూసుకెళ్లిన మేకులాగా లాభశూన్యత ముబారక్బేగం తన్హాయి గీతం...

ఆకలేస్తోంది...

అక్కయ్య వండిపెట్టిన బిసిబేళీబాత్ పులుపెక్కువైందని పనమ్మాయికిచ్చేసా... కుర్చీ చెవ్వుకు వేల్లాడ్తో పాలిథీన్ కవర్‌లోంచీ అసభ్యంగా ఓ అరటిపండు అరకొరగా తననాను ప్రదర్శించుకుంటోంది...

# 'ఆకలి బహువచనం'

## కాశీభట్ల వేణుగోపాల్



'ఎక్సిబిషనిజం' పాపం అరటిపండు...

తప్పు పాలథీన్ కవర్ది... అరటిపండు నగ్నత్వాన్ని బహిర్గతం చేస్తోందదే గదా!

వంగి వాసన చూసా...

ప... శు... వు లాగా ననమాట...

బాగా మగ్గిపోయిందరటిపండు...

దాన్ని పూర్తి దిగంబరం చేసే ఉద్దేశం విరమించుకున్నా...

కిటికీలోంచీ పక్కింటమ్మాయి వేయిస్తూన్న ఉల్లిపాయలు నా మీద పరిమళ యుద్ధాన్ని ప్రకటించాయి...

కామోద్రేకంలాగా కనికర రాహిత్యంతో నాలో వైశ్వానరుడు వేయి నాల్కల్తో భగ్గుమన్నాడు. రాం... రాం... రాం... అనరుస్తో...

గొంతు తడారింది...

నాలుక నీళ్లు నీళ్లు అనరుస్తోంది...

వెళ్లి ఫ్రిజ్ డోర్ తీసా...

షట్టర్ ఎప్పుడో పోయిన డీప్ ఫ్రీజర్... మంచుకొండల మిని యేచర్లతో నిండి వుంది...

డీఫ్రాస్ట్... డీఫ్రాస్ట్...?

ఫ్రాస్టియన్ కవిత్వాన్ని డీఫ్రాస్ట్ చేయాలా?

డీప్ ఫ్రీజర్ అలూమినం డబ్బా నోరు తెర్చుకు నన్ను అలాస్కాకు విసిరేసింది...

ఫ్రిజ్‌డోర్ కీచుమంటోంది...

మంచుమంట...

పాపం 'మంచు మంట' 'దాసు' వంటరిగా చచ్చాడూ...

హిమజ్వాల... సుబ్రమణి... చండీదాసుడెలా అయ్యాడో!

నెబకోవ్ పేల్‌ఫైర్ (Pale fire) చదివుంటాడా...? లేదూ యాదృచ్ఛికమా?

డీప్ ఫ్రీజర్ నేలకతుక్కుపోయిన నీళ్లసీసా తీసా...

వేళ్లు కొంకర్లు పోతున్నాయి...

ఫ్రిజ్‌లోంచి బైటికొచ్చిన సీసాకి నన్ను చూసి భయమేసినట్టుంది...

నిండా చెమట్లు పట్టేసాయి...

సీసా జారి కిందపడి కాసేపు పిల్లాడిలా దొర్లి మౌనంగా...

నాగ్‌పూర్ రైల్వేస్టేషన్లో కొన్న దాదాపు గడ్డకట్టిన నీళ్లసీసా... తీసుకు పరిగెడుతూ... పరిగెడుతూ...

ప్లాట్‌ఫాం మీంచీ గెంతి నే రైల్లో పడితే...

చేతిలో సీసా... చిపుక్కున జారి దొర్లుతూ దొర్లుతూ... రైలుకీ

ప్లాట్‌ఫాంకీ మధ్యన శౌచ మూత్రాల మధ్య పవిత్రంగా జారుకుని పడి నిశ్చల నిశ్శబ్దమైన దృశ్యం కళ్లముందు...

నీళ్లన్నూసింతర్వాత ఆకలింకా యెక్కువైన ఫీలింగ్...

రొడ్డెక్కితే చాలు... సుబ్బయ్య పది రూపాయల మూడు దోసిలు కారప్పొడితో తినొచ్చు... కానీ పక్కన్నే బ్యాకస్‌గాడి గుడుందే!

గుళ్లోకెళ్లాలన్పిస్తుంది... ఊర్నించొచ్చేవరకూ తాగనని అక్కయ్యకు చెప్పానే!

నమ్ముంటుందా అక్కయ్య...?

'నీలిమంచు' ధున్‌తోటి సెల్ రింగ్...

కె.ఎన్.టి.గారు... "వచ్చేస్తున్నా సార్ కరెక్ట్ టైం ట్రైన్... తిన్నగా ఇంటికొచ్చేస్తా" ఆయనకు ఓ వన్‌లైనర్ ప్రామిస్ చేసా... నేపాల్ కుమారీ కథ... కన్యాకుమారి చైనా షాంఘై... ఖాట్మండూ... వారణాశి... తంత్ర విద్యలూ... గంగా... కలకత్తా కాళిక... 'హ్యూగ్ బీ అర్బన్' పుస్తకం... నేపాళ చరిత్ర మూడు సంపుటాలూ... శాస్త్రిగారొస్తే ఆలోచనలకి కాస్తా అడ్డుకట్ట వేసి ఛానలైస్ చేయొచ్చు...

అట్టో ర్యాంక్ (Otto Rank) 'మానసిక తత్వానికతీతంగా' మళ్లీ చదవాలి...

అట్లాగే శాస్త్రిగారికి ప్రామిస్ చేసిన ఇంకో ఆరు టీవీ ఛానెల్ ఎపిసోడ్లు కూడా రాసేయొచ్చు...

భర్తృహరి మీదో... వేమన్న మీదో బద్దెన మీదో విదురుడి మీదో... ఏదో ఓటి కాకితమ్మీద... హ హ్హా హ్హా!

'భర్తృహరి'ని చేతిలోకి తీసుకున్నా... "సంస్కృత వ్యాఖ్యానాంధ్ర పద్య టీకా తాత్పర్య సహితం..."

కడుపు కరకరా మొరాయిస్తోంది... ఓపిక నశిస్తోంది... ఆకలి... ఆకలి... ఆ కళ్ల టబ్ చెయిర్లో కూలబడి టీవీ ఆన్చేసా... ఆకలిగా... ఆకలితో- ఆకలై...

టీవీ కూడా నా మీద కసి పెంచుకున్నట్టు నాపై... నా ఆకలిపై దాడి... ఆకల్నీ నన్నూ రెచ్చగొడ్తూ...

Travel living యాత్రా జీవితం...

Kylie Kwong

ముప్పై ఆరేళ్ల నడ్డిముక్కు కైలీక్వాంగ్ అద్దాల్తో... చైనా వీధుల్లో...

నీళ్ల తొట్లో... శంఖంలో పురుగు...

ఆహా ఏమి రుచి... శంఖం పురుగుదా... శంఖంలాంటి మెడదా? ఆకలండీ ఆకలీ... ఆకలి...

మూత్రపిండాలు... ఉచ్ఛ్వాసస్రావూ? జాయిస్ యులిసిస్‌లో ఏదో రాస్తాడే

Mr.Leopord Bloon ate with relish the inner organs of beasts and fowls... He liked thick giblet soup, Nutty gizzards, a stuffed roast heart, liver slices fried with crust crummbs, fried hen cods roes. Most of all he liked grilled Mutton Kidneys which gave to his palate a fine tang of faintly scented Urine.

టీవీలో కైలీక్వాంగ్ సోయ్ సాస్‌లో ఉడికించిన కోడిగుడ్లు తింటోంది వండుకుని...

ఒళ్లో 'తంత్ర' 'భర్తృహరి' తన్నుకుంటున్నారు...

హ్యూగ్ అర్బన్ పేజీ అక్కడే వుంది... ఎక్కడో క్రీస్తు పూర్వంలో దిక్బంధనం గావించబడినట్టు మంత్రించబడ్డట్టు...


'యాత్రా జీవితం'లో తుమ్ము అడ్వర్టైజ్‌మెంటు...

'చిరంజీవ'

కైలీక్వాంగ్... మెట్లెక్కుతోంది... పచ్చ తలుపు వంటగది...

ఆకలి... కడుపులోంచీ శబ్దాలొస్తున్నాయి... పేగులు పెనుకేకలు... కానీ 'బైరాగి' 'నూతిలో గొంతుకల్లా' వినిపిస్తున్నాయి...

టీవీలో ఓ కోడి నగ్నంగా వేడినీళ్లలో కుతకుతా ఉడుకుతోంది...



సాయిబుల్తోటింకా... అన్నమెందుకూ భయపడి
పారిపోయి దాక్కోడమెందుకూ...
పొట్టిజుత్తు బంగ్లా అమ్మాయి కూడా... తస్లీమా... ముస్లీమా!
అబ్బో పద్మాలక్ష్మి బక్క పల్చటి పద్మాలక్ష్మి...
ఉడిపీ కృష్ణా గుడి వంటగదుల్లో గుండిగల మధ్య...
అక్కడైతే... ఆకలైతే 'అన్నమో శ్రీకృష్ణా!' అనాలేమో...!
చారు గుండిగల్లోకి కరివేప కట్టల్ని వేస్తూన్న పద్మాలక్ష్మి...

వరస దృశ్యాలు కళ్లముందు ఆకలి కళ్లముందు... ఆ కళ్ల ముందు ఆకళ్లు... 'పింక్‌లీ' ర్యాప్ పాడుతోంది...

పాటలు పాడ్డం రాకపోతే తాళానికి మాటాడ్డం... ర్యాప్... ర్యాప్... ర్యాప్...

పద్మాలక్ష్మి గుర్తొచ్చింది...

రుష్దీ యీమెన్నూడా వదిలేసాడు కదా...! లేదూ లక్ష్మే రుష్దీనొదిలేసిందా?

మధ్యరాత్రి పిల్లలూ... సిగ్గూ... పులినవ్వూ... దెయ్యపు రాతల రుష్దీ...

ఇందిరాగాంధీతో గొడవ పెట్టుకున్నాడు...

సాయిబుల్తోటింకా... అన్నమెందుకూ భయపడి పారిపోయి దాక్కోడమెందుకూ...

పొట్టిజుత్తు బంగ్లా అమ్మాయి కూడా... తస్లీమా... ముస్లీమా!

అబ్బో పద్మాలక్ష్మి బక్క పల్చటి పద్మాలక్ష్మి...

ఉడిపీ కృష్ణా గుడి వంటగదుల్లో గుండిగల మధ్య...

అక్కడైతే... ఆకలైతే 'అన్నమో శ్రీకృష్ణా!' అనాలేమో...!

చారు గుండిగల్లోకి కరివేప కట్టల్ని వేస్తూన్న పద్మాలక్ష్మి...

ఆకలి... 'ఆ...క...లి'

దాహం కూడా... మంచునీళ్లు ఓ గుక్క తాగా... దాహం... మోహం... భాగవతం...

మోహాదులైన ఊర్ములు... ఆరు... ధాతువులూ, ప్రాణాలూ...

ఆకలి, శోకం, మోహం, దాహం, ముసలితనం, చావు... ఊర్ములు...

బుద్ధి, కండరాలు, చర్మం, రక్తం, మజ్జి, బొమికలు, రేతస్సు... ధాతువులట... పాపం ఆడాళ్లకీ ఏడోది అండమనాలా?

ఎన్ని ఎన్నెన్ని ప్రాణాలో...
వ్యానం, నాగం, ప్రాణం, సమానం, అపానం, ఉదానం, కూర్మం, దేవదత్తం, కృకరం, ధనంజయం... ప్రాణాలూ వాటికి ఉపప్రాణాలో... బొంద...
వీటన్నింటికీ కలిపి యిప్పుడు నా కాకలీ దాహం...
టీవీ మీదకి కళ్లు వెళ్లాయి మళ్లీ...
**Las Vegas** మీద 'డోకుమెంటరీ' హోటల్ 'బలాజీయో' ముందు నీళ్ల చిమ్ముతూ నాట్యం చేస్తున్నాయి... ఆక్వాటిక్ బ్యాలే మైసూర్ బృందావనంలో కూడా వుంది కదూ...
మళ్లీ తిండి ఛానెల్...
ఆ...క...లి...
వంటవాళ్లందరూ వరసగా దండెత్తారు...
మారుత్ సిక్కా...
మంజు మాల్హి (మాలతి) కుడి పెదవి కింద పులిపిరితో అద్దాల్తో... నైస్ నటాషా నిఖిల్... ఉప్పు కారాల్లేని గడ్డిగాదాలు... థాయ్ వియత్నాంల గడ్డివరిక్కావాలి...
సంజీవ్‌కపూర్... రాకేష్‌శేథీ...
జానకమ్మ షాహుకారు... కాచారు మైసూరు చారు... టీవీ ల్లోంచీ వాసనలొస్తే?
ఇరవై ఏళ్ల క్రితం... న్యాషనల్ రైస్ కుక్కర్కి నేనిచ్చిన డెమో గుర్తొచ్చింది...
వంకాయ ముద్ద కూర, వాదిరాజ్‌గాడు వత్తేసి కాల్చేసిన పూరీల్తో...
ఆ...క...లి...
ఒక్క వితస్తి దూరంలో యీ కుక్షికి పైనో ఆకలి... కిందో ఆకలి... రెండూ భయంకరమే... కిందాకలి... కళ్ళ మసకబారి... ఓ చైతన్య చిత్రాన్ని చూసాయి... పరిమళభరిత చైతన్య చిత్రం... నోరూ కళ్లూ ఊరిస్తూ...
ఝూన్సీ! మై ఫ్రేగ్రెంట్ డెలిషస్ ఝూన్సీ!
ఒళ్లో భర్తృహరి...
'ప్రణయ మధురాః ప్రేమోద్గారా రసాశ్రయతాం గతాః
ఝూన్సీ... ఝూన్సీ...
ప్రణయ విస్రంభమే స్నేహమట...
ఏం పోయే రోగమో ఈ కవులకు...
'రహసి కిమపి స్వైరాలాపా హరన్తి మృగీదృశామ్...'
ఝూన్సీ..
ఆ...క...లి...
ఘనసారాల పరిమళాలు రొమ్ములు...
మృగమద పదకవితల నాభీ...
అరవిడిన కలువల కటి...
నీ కాళుల కోయిల దుముకి... చిటికి...
ఒక ఊపిరి...
ఝూన్సీ! ఝూన్సీ! ఝూన్సీ...
ఆ...క...లి
ఇప్పుడది కాందిశీకయై చీకటి కటి చేరింది... యేం చేయన్నేనూ?...
'తులూస్ లోత్రెకొ' పెయింటింగ్స్ మీదా వాడి కురూపితనం వాడి పెయింటింగ్స్ మీద చూపించిన ప్రభావం గురించి వాడి జీవిత చరిత్ర కావాలంది ఝూన్సీ.... రావొచ్చు కదా!
యంతందంగా చూస్తుందో!
మళ్లీ భర్తృహరి దాడి...

ఇప్పుడది కాందిశీకయై చీకటి కటి చేరింది... యేం చేయన్నేనూ?... 'తులూస్ లోత్రెక్' పెయింటింగ్స్ మీదా వాడి కురూపితనం వాడి పెయింటింగ్స్ మీద చూపించిన ప్రభావం గురించి వాడి జీవిత చరిత్ర కావాలంది ఝూన్సీ.... రావొచ్చు కదా!

'నూనమాజ్ఞాకరస్తస్యాః సుభ్రువో మకరధ్వజః
యతస్తన్నేత్ర సంచార సూచితేషు ప్రవర్తతే'
మన్మథుడే ఆమె బానిస... ఒక్కసారి చూస్తే చాలు... వాడు వాళ్ల మీదకి దండెత్తుతాడు ముండాకొడుకు...
నిజానికి ఝూన్సీకి అదనపు మెరుగులవసరం అస్సల్లేదు....
చామనఛాయకు ఓ మెట్టు ఎక్కువైన రంగు...
నవ్వితే ఎర్రగా కనబడే చివుళ్లు...
గెడ్డమ్మీద సొట్ట...
పొట్టి చేతుల చుడీదార్... నున్నటి జబ్బలు... యింకా నున్నటి గొంతుక...
వెనక మెడ మీద రింగులు రింగులుగా చుట్టుకున్న వెంట్రుకలు...
అన్నిటికీ మించి తన దగ్గర ఓ మధు పరిమళం...
అప్రయత్నంగా గుండెల్నిండా ఊపిరి పీల్చుకున్నా... ఝూన్సీ పరిమళం కోసం... యెంత కమ్మటి పరిమళం ఝూన్సీ దగ్గర...!
పసి పాపల్ని స్నాతుల్ని చేసి... సాంబ్రాణీ, పాలమడ్డీ పొగ ల్వేసి... రాసీ రాయక రాసిన పవుడరుతో పాటు... వాళ్ల పాల వాంతితో మిళితమైన పరిమళం...
ఝూన్సీ కంఠంలో మొహం దాచేసుకుం...'
"యంత కమ్మగా వుంటావు ఝూన్సీ!" అనంటే



"యిప్పటికిప్పుడు పాల పీకలు కొని తెచ్చేట్టున్నావు రవుడీముండా!" అని ఆ పరిమళం కంటే కమ్మగా మెత్తగా తిట్టే...
ఝూన్సీ! ఝూన్సీ! ఝూన్సీ...
ఆ...క...లి
భరించలేను...
ఇవేమి ఆకళ్లు బాబోయ్... ఒక్కాకలా? రెండా?...ఛప్పన్నారు....
శృంగార శతకం మధ్యలో వుంచిన పెన్ను తీసి భర్తృహరి మూసేసా... దీర్ఘంగా ఆ పుస్తకాన్ని చూసా...
భర్తృహరీ! యిప్రకారంబుగా శ్లోకంబులు రచియించి మము బోంట్లను వ్యథకు గురి చేయుచున్న నీకిదియే శాపంబు... నువ్వు పునః ప్రభవించి యింతకు పెక్కుడు రెట్లు యందమైన కవిత్వంబు నుడివెదవు గాక...
అస్తు... అస్తు... అస్తు...

***

ఆ...క..లి... నీరసం వస్తోంది....
ప్రపంచ యుద్ధాలు... నాగరికతల నాశనాలు... పెళ్లాల నెత్తుకెళ్లడాలు... హత్యలు... దోపిడులు... ప్రేమలు... ఆఖరికి ముప్పావలా చాయ్...
ఒక సిగరెట్... ఒక బిందెడు నీళ్లు... నెత్తురోడే పిడికెడన్నం...
ఫైవ్ స్టార్ హోటెళ్లూ... పాకల్లో బన్నురొట్టె... కళాక్షేత్రాలూ... కుంచె చివళ్ల వేల్లాడే వర్ణాల ఆత్మహత్యలూ... ఎన్ని ఎన్నెన్ని...?
ఖైదీల బదలాయింపులూ... ఉరిశిక్షల రద్దుకై రాద్ధాంతాలూ...
రాజకీయాలూ... కుర్చీలకై కుతంత్రాలూ... సైన్సూ... సాహిత్యమూ...
ఈ ప్రపంచం యావత్తూ ఓ పల్చటి ముసుగులో వుంది... కొన్ని వెచ్చటి సాయంత్రాల జ్ఞాపకాల ఒయాసిస్సుల్లో దాహార్తిని తీర్చుకోబోయే మూర్ఖులూ... రెండు శరీరాల పెనవేత... రెండు జీవధాతువుల కలయిక కోసం ప్రకృతి మన మీదకు విసిరేసిన వల... ఆకలి...
ఆ...క...లి
నీలి మంచు ధున్‌తో ఫోన్రింగైంది...